క్లుప్తంగా

ఆంజనేయస్వామికి విశేష పూజలు



విశేషాలంకరణలో ఆంజనేయస్వామి

పొదలకూరు : పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న వీర అభయాంజనేయస్వామికి మంగళవారం అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ఉదయం ఆకుపూజ, అభిషేకాలు, పూజలు, తిరిగి సాయంత్రం స్వామికి పల్లకిసేవ గావించారు.

విద్యుత్ షాక్‌తో గేదెల మృతి



మృతిచెందిన గేదె

వెంకటాచలం : మండలంలోని తిక్కవరప్పాడు గ్రామానికి చెందిన బైన సురేష్ గేదెలు గ్రామ సమీపంలోని అడవిలో విద్యుత్ షాక్‌తో మృతి చెందాయి. వారం రోజుల క్రితం మేత కోసం వెళ్లిన రెండు గేదెలు తిరిగి ఇంటికి రాకపోవడంతో సురేష్ చుట్టుపక్కల గ్రామాల్లో వెతికించారు. అయినా ఆచూకీ లభించలేదు. కాగా అడవిలో విద్యుత్ షాక్‌తో రెండు గేదెలు మృతి చెంది ఉన్నాయని కొందరు గ్రామస్తులు చెప్పడంతో వెళ్లి పరిశీలించగా, మృతిచెందిన గేదెలు తనవే అని నిర్ధారించుకున్నారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చనిపోయిన రెండు గేదెలు రూ.1.20 లక్షల విలువ ఉంటుందని బాధితుడు వాపోయారు.

రేపట్నుంచి క్రీడా జట్ల ఎంపికలు

నెల్లూరు (టౌన్): నగర నియోజకవర్గ పరిధిలో 2023 – 24 విద్యా సంవత్సరానికి సంబంధించిన స్కూల్ గేమ్స్ అండర్ – 14, 17 బాలబాలికల జట్లను ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో గురువారం నుంచి ఎంపిక చేయనున్నామని ఎంఈఓ తిరుపాల్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నగర నియోజకవర్గంలోని అన్ని యాజమాన్య పాఠశాలల విద్యార్థులు అర్హులని చెప్పారు. అండర్ – 14 విభాగంలో 2010 జనవరి ఒకటి.. 17 ఏళ్ల విభాగంలో 2007 జనవరి ఒకటి తర్వాత జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్, వాలీబాల్ పోటీలు గురువారం.. ఖోఖో, త్రోబాల్, టెన్నికాయిట్, యోగా పోటీలు శుక్రవారం.. అథ్లెటిక్స్ జట్లను శనివారం ఎంపిక చేయనున్నామని వివరించారు. హాజరయ్యే వారు అకడమిక్ మానిటరింగ్ యాప్‌లో పేర్లను నమోదు చేసుకోవాలని, వివరాలకు 94418 04551 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

గురజాడ జయంతి సభ రేపు

నెల్లూరు(బృందావనం): మహాకవి గురజాడ అప్పారావు జయంతి సభను పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజ హాల్లో గురువారం నిర్వహించనున్నామని కన్యాశుల్కం నాటక నిర్వహణ కమిటీ కోశాధికారి కోటిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో కాత్యాయని వ్రతం



నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో కాత్యాయని వ్రతాన్ని సామూహికంగా మంగళవారం నిర్వహించారు. దేవస్థాన ప్రధానార్చకుడు రఘురామశర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. రాజరాజేశ్వరి అమ్మవారి సేవా సమితి అధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, ఈఓ అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ రత్నం జయరామ్ తదితరులు పర్యవేక్షించారు.

కేన్సర్ ఆస్పత్రికి విరాళం

నెల్లూరు(బారకాసు): పొదలకూరు రోడ్డులో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కేన్సర్ ఆస్పత్రికి రూ.రెండు లక్షల విరాళాన్ని శమంత్ మంగళవారం అందజేశారు. తన తండ్రి డాక్టర్ రామచంద్రారెడ్డి స్మృత్యర్థం ఈ మొత్తాన్ని హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ నాగేశ్వరరావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ లక్ష్మి, జనరల్ మేనేజర్ మస్తానయ్యకు చెక్కు రూపంలో ఇచ్చారు.

గణనాయక.. లోకపాలక



పొదలకూరు : రామనగర్‌గేటు సెంటర్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడు



బుచ్చిరెడ్డిపాళెం: హౌస్‌తోటలో..



బుచ్చిరెడ్డిపాళెం: ప్రత్యేక పూజల్లో కౌన్సిలర్ ప్రసాద్

'జై బోలో గణేశ్ మహరాజ్‌కి.. జై' అంటూ ఊరూ.. వాడా మార్మోగింది. గణనాయక.. లోకపాలక.. ఇకపై తమకు ఎలాంటి కష్టాలు రాకుండా చూడాలయ్యా.. అంటూ ప్రజలు బొజ్జ గణపయ్యకు పూజలు చేశారు. కోవూరు, సర్వేపల్లి నియోజకవర్గ ప్రజలు వినాయక చవితి వేడుకలను సోమ, మంగళవారాల్లో ఘనంగా జరుపుకున్నారు. ప్రతివీధిలో భిన్న రూపాల్లో గణనాథుల విగ్రహాలను ఏర్పాటు చేసుకుని ఉత్సవాలు జరిపారు. ప్రతి ఇంటా చిట్టి గణపయ్యలను ప్రతిష్టించి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. చవితి వేడుకలతో ప్రతి వీధిలో సందడి వాతావరణం నెలకొంది. చిన్నారులు ఉట్టి కొట్టి సంబరాలు చేసుకున్నారు. భక్తి గీతాలతో హోరెత్తించారు. ఉత్సవ కమిటీలు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశాయి.

– సాక్షి నెట్‌వర్క్



బుచ్చిరెడ్డిపాళెం: విద్యాసదన్ వీధిలో..



పొదలకూరు : పద్మావతినగర్‌లోని గణపయ్య



వెంకటాచలం : తిక్కవరప్పాడులో..



తోటపల్లిగూడూరు : చిన్నచెరుకూరులో..



ముత్తుకూరు : వెంకన్నపాళెంలో..



ముత్తుకూరు : ఈపూరు పట్టపుపాళెంలో..

పౌష్టికాహారం తప్పక తీసుకోవాలి



తల్లీబిడ్డకు పౌష్టికాహారం అందజేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

పొదలకూరు : గర్భిణులు, బాలింతలు, పిల్లలు తప్పక పౌష్టికాహారం తీసుకోవాలని వెంకటాచలం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.జ్యోతిలక్ష్మి పేర్కొన్నారు. పట్టణంలోని కేఆర్‌ఆర్ నగర్ గిరిజన కాలనీలో పోషణ్ మాసోత్సవాలను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ మాట్లాడుతూ గర్భిణులు రక్తహీనతను ఎదుర్కొనేందుకు రాగులు, జొన్నలు, సజ్జలు, వేరుశనగ చిక్కీలు, ఆకుకూరలు, కోడిగుడ్లను సమపాళ్లలో తీసుకోవాలన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు ఉన్న ఆహారం వీటి ద్వారా లభిస్తుందన్నారు. స్థానిక వార్డు సభ్యుడు ఎస్‌కే అంజాద్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు అన్నివిధాలుగా సహకారం అందిస్తామన్నారు. సమావేశంలో అంగన్‌వాడీ టీచర్లు మణెమ్మ, వెంకటకుమారి, ఆయాలు ఆదెమ్మ, రూప పాల్గొన్నారు.



కొడవలూరు: పౌష్టికాహారంపై అవగాహన

రక్తహీనతకు చెక్

కొడవలూరు : మంచి పౌష్టికాహారం తీసుకోవడం వల్ల రక్తహీనతకు చెక్ పెట్టవచ్చని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగభూషణమ్మ అన్నారు. మండలంలోని రాచర్లపాడు అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు తప్పనిసరిగా ఆరునెలల పాటు తల్లిపాలు పట్టించాలన్నారు. తరువాత పాలతో పాటు మంచి పౌష్టికాహారాన్ని అందించడం వల్ల రక్తహీనతకు చెక్ పెట్టవచ్చన్నారు. అలాగే బాలింతలు, గర్భిణులు కూడా రక్తహీనత నుంచి బయట పడాలంటే పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో అందజేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు రాజేశ్వరి, అమల, విజయమ్మ, కృష్ణవేణి, చెంచమ్మ, ఆరోగ్య సిబ్బంది రాధిక, కామాక్షి పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షను పక్కాగా నిర్వహించాలి

ముత్తుకూరు : ఈనెల 30వ తేదీ నుంచి జరుగనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ కంట్రోల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్‌కే ఖాదర్‌వలీ వైద్య సిబ్బందికి సూచించారు. ముత్తుకూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులు తనిఖీ చేశారు. అటెండెన్స్, ఈడీడీ, ఓపీ రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో జరుగుతున్న కాన్పులు, ప్రజలకు అందిస్తున్న వైద్యసేవలపై ఆరా తీశారు. అందుబాటులో ఉన్న మందుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్–ఫార్మసీ నిర్వహణపై సమీక్ష జరిపారు. అనంతరం పంటపాళెం పంచాయతీలోని ఊటల బలిజపాళెంలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను పరిశీలించారు. అవసరమైన సూచనలు చేశారు.



ఊటల బలిజపాళెంలో ఆరోగ్య సర్వేను పరిశీలిస్తున్న ఖాదర్‌వలీ

మహిళా బిల్లు ఆమోదం హర్షణీయం



ఎం.సుబ్బారెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం : పార్లమెంట్‌లో మహిళా బిల్లు ఆమోదంపై ప్రపంచ మానవహక్కుల సంఘం చైర్మన్ మూరంరెడ్డి సుబ్బారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం మాట్లాడుతూ మహిళా బిల్లు రాజ్యసభలో ఆమోదం పొంది లోక్‌సభలో ఆమోదం పొందక దాదాపు 13 సంవత్సరాలు ఆగిందన్నారు. ప్రస్తుతం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చొరవతో మహిళా బిల్లు ఆమోదం పొందడం ద్వారా 2029 నుంచి చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు కానుందని తెలిపారు. ఇది చాలా హర్షణీయమన్నారు.

వృద్ధురాలి మెడలో చైన్ స్నాచింగ్

నెల్లూరు(క్రైమ్): వాటర్ ప్లాంట్‌లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలి మెడలోని గొలుసును గుర్తుతెలియని దుండగులు తెంపుకెళ్లారు. పోలీసుల సమాచారం మేరకు.. నవాబుపేటలోని ఎఫ్‌సీఐ కాలనీలో నివాసం ఉంటున్న నరసమ్మ పిల్లలు సమీపంలో వాటర్ ప్లాంట్‌ను నిర్వహిస్తున్నారు. పిల్లలు అందుబాటులో లేని సమయంలో ప్లాంట్‌ను ఆమె పర్యవేక్షిస్తారు. ఈ క్రమంలో అక్కడ సోమవారం ఆమె ఉండగా, ఇద్దరు గుర్తు తెలియని యువకులు రెక్కీవేశారు. నీళ్లు కావాలంటూ కొద్దిసేపు ఆమెతో మాట్లాడి వెళ్లిపోయారు. వాటర్ ప్లాంట్‌లోకి రాత్రి 8.30 ప్రాంతంలో దుండగులు ప్రవేశించి ఆమె మెడలోని మూడు సవర్ల బంగారు గొలుసును తెంపుకెళ్లేందుకు యత్నించారు. ప్రతిఘటించిన ఆమె గొలుసును గట్టిగా పట్టుకున్నారు. దుండగులు గట్టిగా లాగడంతో గొలుసు రెండుగా తెగింది. దుండగులు తమ చేతికొచ్చిన ఒకటిన్నర సవరతో అక్కడి నుంచి ఉడాయించారు. అనంతరం నవాబుపేట పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

బుచ్చిరెడ్డిపాళెం : పర్యావరణ పరిరక్షణలో ప్రజలందరూ బాధ్యతగా వ్యవహరించాలని నగర పంచాయతీ సిబ్బంది కోరారు. ఈ మేరకు బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలో ఇండియన్ స్వచ్ఛతా లీగ్ 2.0 అవగాహన ర్యాలీని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి ఆదేశాల మేరకు అవగాహన ర్యాలీని నిర్వహించినట్లు తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేయవద్దని కోరారు. అలాగే పచ్చదనాన్ని నాశనం చేయవద్దని, వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో వేసి తగలబెట్టడం సరికాదన్నారు. భవిష్యత్ తరాల వారికి స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించేందుకు అందరూ కలిసికట్టుగా బాధ్యత తీసుకోవాలని సూచించారు. అనంతరం స్థానికంగా పారిశుద్ధ్య పనులు చేపట్టారు. కార్యక్రమంలో నగర పంచాయతీ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న నగర పంచాయతీ సిబ్బంది

పరిశోధన స్థానం అభివృద్ధికి కృషి

పొదలకూరు : తాను ఎక్కువ కాలం పనిచేసిన పొదలకూరు వ్యవసాయ పరిశోధన స్థానం అభివృద్ధికి కృషి చేస్తానని ఎన్జీరంగా యూనివర్సిటీ బోర్డు మెంబర్, విశ్రాంత ప్రధాన శాస్త్రవేత్త డేగపూడి కోదండరామిరెడ్డి పేర్కొన్నారు. పొదలకూరులోని పరిశోధన స్థానాన్ని, ఏజీ పాలిటెక్నిక్ కాలేజీ హాస్టల్‌ను ఆయన మంగళవారం పరిశీలించారు. యూనివర్సిటీ పరిధిలో ఉన్న కళాశాలల్లో భవన వసతికి నిధులు సాధించేందుకు కృషి చేస్తానన్నారు. వీసీ ఆదాల విష్ణువర్ధన్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తన ఎంపికకు సిఫార్సు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. బోర్డు సమావేశాల్లో తమ సలహాలు, సూచనలు స్వీకరించి అమలు చేస్తున్నారని, ఇక్కడి సమస్యలను బోర్డు మీటింగ్‌లో ప్రస్తావిస్తానన్నారు. వర్సిటీ శాస్త్రవేత్తలు వ్యవసాయంలో ఎన్నో వినూత్న పద్ధతులను ఆవిష్కరించినట్లు చెప్పారు. దేశంలో డ్రోన్లతో మందు పిచికారీ చేయడం ఎన్జీరంగా వర్సిటీ శాస్త్రవేత్తల కృషి ఫలితమేనన్నారు. ఇక్కడి పరిశోధన స్థానంతో తనకు విడదీయలేని అనుబంధం ఉందన్నారు. క్షేత్రస్థాయిలో పంటల సాగు, హాస్టల్లో సౌకర్యాలు బాగున్నట్లు తెలిపారు. ఆయన వెంట ప్రధాన శాస్త్రవేత్త ఒ.వెంకటేశ్వర్లు ఉన్నారు.



పాలిటెక్నిక్ కాలేజీ హాస్టల్‌ను పరిశీలిస్తున్న కోదండరామిరెడ్డి

శ్రీనివాసులుగౌడ్‌కు సన్మానం

పొదలకూరు : జిల్లా గౌడ సంఘం ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన మండలంలోని మర్రిపల్లి గ్రామానికి చెందిన వెంపులూరు శ్రీనివాసులుగౌడ్‌ను బీసీ సంక్షేమ సంఘం బాధ్యులు మంగళవారం పొదలకూరులో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండల బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వూకోటి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ శ్రీనివాసులుగౌడ్ కల్లుగీత కార్మికుల సమస్యలపై వేగంగా స్పందిస్తారన్నారు. సేవా కార్యక్రమంలో పాల్గొని వారి అభివృద్ధికి కృషి చేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా గౌడ యువత అధ్యక్షుడు తాళ్ల రాజాగౌడ్, జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు పముజుల శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.



శ్రీనివాసులుగౌడ్‌ను సన్మానిస్తున్న బీసీ నేతలు

రాష్ట్రస్థాయి పోటీలకు పల్లిపాడు విద్యార్థులు



ఎంపికైన క్రీడాకారులతో హెచ్ఎం, ఉపాధ్యాయులు

ఇందుకూరుపేట : ఈనెల 30 నుంచి కర్నూలు జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్(అండర్–16) బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు మండలంలోని పల్లిపాడు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్ఎం డి.జ్ఞాన ప్రసూన తెలిపారు. రెండు రోజుల క్రితం నెల్లూరులో జరిగిన ఎంపికల్లో పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచి జిల్లా జట్టులో స్థానం సాధించారన్నారు. బాలుర విభాగంలో సుశాంత్‌సాయిరెడ్డి, నెల్లూరు శ్రీనివాసులు, బాలికల విభాగంలో ఎస్.ప్రణవిసాయి, తాండ్ర దీపికామణి, నెట్రంబాక శ్రావ్య, వింజమూరు సుహాసిని ఎంపికైనట్లు వివరించారు. ఈ సందర్భంగా పల్లిపాడు ప్రభుత్వ పాఠశాలలో క్రీడాకారులతో పాటు వ్యాయామ ఉపాధ్యాయుడు లక్ష్మయ్యను మంగళవారం హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

నియామక పత్రం అందజేత

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పబ్లిక్ హెల్త్ విభాగంలో వర్కర్‌గా విధులు నిర్వర్తిస్తూ తాళ్లూరి కుమారమ్మ మృతి చెందడంతో ఆమె కుమారుడు జాన్సన్‌బాబుకు కారుణ్య నియామకం కింద ఉద్యోగం కల్పించారు. కార్పొరేషన్ హెల్త్ విభాగంలో క్లీనర్‌గా బాధ్యతలు కల్పిస్తూ నియామక ఉత్తర్వులను కమిషనర్ వికాస్ మర్మత్ మంగళవారం అందజేశారు.

ఏపీఎమ్మెఫ్ జిల్లా కన్వీనర్‌గా మల్లికార్జున్

నెల్లూరు(మినీబైపాస్): ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ (ఏపీఎమ్మెఫ్) అడ్‌హాక్ కమిటీ జిల్లా కన్వీనర్‌గా మల్లికార్జున్ ఎన్నికయ్యారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడారు. కన్వీనర్లుగా ప్రసాద్, డేవిడ్, మౌంట్ బాటన్, శ్రీహరి, రఫీ ఎన్నికయ్యారని చెప్పారు. పూర్తి కమిటీని త్వరలో ప్రకటించనున్నామని పేర్కొన్నారు.